ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.9 ⁝ కనిష్ఠం 24.6
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 6 జూలై 2024



మండల ప్రజాపరిషత్ ప్రత్యేక అధికారులు..

మండలం	ప్రత్యేక అధికారి	ఫోన్‌నెంబర్
ఆర్మూర్	శ్రీనివాస్ డీసీవో, నిజామాబాద్	9100115747
నందిపేట్	జగన్నాథచారి, డీపీఏహెచ్‌వో, నిజామాబాద్	9989997573
మాక్లూర్	ముత్తెన్న, డీవైఎస్‌వో, నిజామాబాద్	9701177144
బాల్కొండ	ఎస్‌కె.రసూల్‌బీ, డీడబ్ల్యువో, నిజామాబాద్	8008771786
భీమ్‌గల్	విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్ఎం సీడ్స్, నిజామాబాద్	9849908755
కమ్మర్‌పల్లి	సాయాగౌడ్, డీఆర్‌డీవో, నిజామాబాద్	9281486366
మోర్తాడ్	ఎంబీ. మధుసూన్, డీహెచ్‌ఎస్‌వో, నిజామాబాద్	8977713968
మెండోర	రాజనర్సయ్య, ఏడీ ఫిషరీష్, నిజామాబాద్	9182467008
ముప్కాల్	శ్రీనివాస్, ఏడీఎస్‌ఎల్‌ఆర్, నిజామాబాద్	9866407692
వేల్పూర్	కృష్ణవేణి, డీఎండబ్ల్యూవో, నిజామాబాద్	9493115986
ఏర్గట్ల	శివకృష్ణ, డీఎల్‌పీవో, ఆర్మూర్	9493000787
జక్రాన్‌పల్లి	తిరుమలప్రసాద్, డీడీఎఫ్‌టీసీ, నిజామాబాద్	7288894625
బోధన్	తరుణ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి	98499 00112
ఎడపల్లి	నందకుమారి, విజయ, డెయిరీ మేనేజర్	91211 60536
రెంజల్	వాజీద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయ అధికారి	72888 94567
నవీపేట్	మల్లిఖార్జున్, జిల్లా ప్రణాళిక అధికారి	77804 76081

- జిల్లాలో మొదలైన ప్రత్యేక అధికారుల పాలన
- బాధ్యతలు స్వీకరించిన అధికారులు
- జడ్పీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్
- మండలాల్లో బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు
- వీరి ఆధ్వర్యంలోనే కొనసాగనున్న అభివృద్ధి పనులు

పరిషత్‌లలో 'ప్రత్యేక' పాలన షురూ!

నిజామాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. మండల ప్రజాపరిషత్, జడ్పీ సభ్యుల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల తరఫున ఉత్తర్వులు జారీ చేయడంతో మండలాలకు ప్రత్యేక అధికారులు బాధ్యతలను చేపట్టారు. జడ్పీ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ బాధ్యతలను తీసుకున్నారు. వీరి ఆధ్వర్యంలోనే ఆరు నెలల వరకు పనులు కొనసాగనున్నాయి. అభివృద్ధి పథకాలతో పాటు వివిధ పథకాలు అమలు కానున్నాయి. నిధులను వెచ్చించడంతో పాటు ఆయా కార్యక్రమాలకు వారు ఖర్చు చేయనున్నారు. అవసరాల మేరకు గ్రామాల్లో పనులు చేపట్టనున్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి మండలాలకు, జడ్పీకి సభ్యులు వచ్చి పాలకవర్గం ఏర్పాటు అయ్యేంతవరకు వీరి ఆధ్వర్యంలోనే పనులను కొనసాగనున్నాయి. ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహించేందుకు బీసీ రిజర్వేషన్ అడ్డంకిగా ఉండటంతో ప్రత్యేక అధికారులతోనే కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమైంది. బీసీ గణన పూర్తయి రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతనే మళ్లీ ఎన్నికలు జరిగి కొత్త పాలకవర్గం వచ్చే అవకాశం ఉండటంతో పనులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక అధికారులను నియమించారు.

జడ్పీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్

జిల్లా ప్రజాపరిషత్ సభ్యుల పదవీకాలం పూర్తికావడంతో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. జడ్పీకి వచ్చిన ఆయనకు సీఈవో ఉషాతో పాటు అధికారులు స్వాగతం పలికారు. ఆరు నెలల వరకు ఆయన ఆధ్వర్యంలోనే పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగనున్నాయి. జడ్పీకి విడుదలయ్యే నిధుల ఖర్చుతో పాటు అభివృద్ధి పనులు వివిధ శాఖల ద్వారా ప్రత్యేక అధికారి ద్వారానే చేపట్టనున్నారు. మండల ప్రజాపరిషత్ సభ్యుల పదవీకాలం పూర్తికావడంతో ప్రత్యేకంగా నియమితులైన అధికారులు గురు, శుక్రవారాల్లో బాధ్యతలను చేపట్టారు. మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల ప్రజాపరిషత్ ద్వారా అమలవుతున్న పథకాలు, పనులను తెలుసుకోవడంతో పాటు పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు సిద్ధమయ్యారు.



జడ్పీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపడుతున్న కలెక్టర్

జనాభా దామాషా ప్రకారం నిధులు

మండల ప్రజాపరిషత్‌కు, గ్రామ పంచాయతీలకు, జడ్పీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు వస్తున్నాయి. జనాభా దామాషా ప్రకారం ఈ నిధులను విడుదల చేస్తున్నారు. వివిధ ఆర్థిక కమిటీల కింద ఈ నిధులను విడుదల చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం పూర్తి కాగానే ఫిబ్రవరి నెలలో ప్రత్యేక అధికారులను నియమించారు. వివిధ ఆర్థిక సంఘాల కింద గ్రామ పంచాయతీలకు వస్తున్న నిధులను వారి ఆధ్వర్యంలోనే ఖర్చు చేస్తున్నారు. గ్రామాల్లో అవసరమైన పనులకు వెచ్చిస్తున్నారు. ఉద్యోగుల జీతాలతో పాటు ట్రాక్టర్ రుణాలు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు మిగతా నిధులను వెచ్చిస్తున్నారు. ప్రస్తుతం మండలాలకు కూడా ప్రత్యేక అధికారులను నియమించడంతో వారి ఆధ్వర్యంలోనే ఈ నిధులన్ని ఖర్చు చేయనున్నారు. ఆర్థిక సంఘాల ద్వారా వచ్చే నిధులు గ్రామ పంచాయతీలతో పాటు మండలాలకు, జెడ్పీలకు కూడా కొంత మేర వస్తున్నాయి. ఈ నిధులను పాలకమండలిలో చర్చించి ఇప్పటి వరకు ఖర్చు చేశారు. ప్రత్యేక అధికారుల పాలన మొదలు కావడం వల్ల వీరి ఆధ్వర్యంలోనే ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. కొత్తగా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను కూడా ప్రత్యేక అధికారులు అమలు చేయనున్నారు. పాలకవర్గాలు ఏర్పడేంతవరకు వీరి ఆధ్వర్యంలోనే ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఐదేళ్ల పాటు పాలకవర్గం పనులు చేపట్టగా ఈ ఆరునెలల కాలం వరకు ప్రత్యేక అధికారులు నిధులను ఉన్నతాధికారులకు చర్చించి ఆయా శాఖల ద్వారా ఖర్చు చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు బాధ్యతలను చేపట్టడంతో ఇక మండలాల్లో ప్రజాప్రతినిధుల సందడి తగ్గనుంది.

'నీట్'ను మళ్లీ నిర్వహించాలి



నగరంలోని ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీల సభ్యులు

పెద్దబజార్, జూలై 5: కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని ఆపాలి, నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద వామపక్ష పార్టీల సభ్యుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేస్తూ ప్రైవేటీకరిస్తున్నారని అన్నారు. వేలాది మంది కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ చేసి 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్‌టీఏ ఏజెన్సీ చెలగాటం ఆడుతుందని నీట్ పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. ఎన్‌టీఏను రద్దు చేయాలని రాష్ట్రాల పరిధిలో నీట్ పరీక్ష నిర్వహించాలని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నగర కార్యదర్శి సుధాకర్, వామపక్షాల నాయకులు ఓమయ్య, శివకుమార్, నూర్జహాన్, పెద్దివెంకటరాములు, సిర్పలింగం, ముత్తెన్న, రాజేశ్వర్, కృష్ణ, సాయిరెడ్డి, రవి పాల్గొన్నారు.



నిజాంసాగర్ వెలవెల!

నిజాంసాగర్, జూలై 5: ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు లేక నిజాంసాగర్ వెలవెలబోతోంది. మంజీరా వెంట వరద లేక బోసిపోయింది. ఆయకట్టు కిందవేసిన వరి నారు మళ్లు ఎండిపోతుండటంతో సాగర్ నుంచి అడపాదడపా నీటిని విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో 1405 అడుగులకు గాను ప్రస్తుతం 1389.42 అడుగుల నీటి సామర్థ్యం కలిగి 3.096 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వానాకాలం ప్రారంభమై నెల రోజులైనా ఇప్పటివరకు ఎలాంటి వర్షపాతం నమోదు కాలేదు. మంజీరావెంట ఉన్న నీటి నిల్వలు రైతులు లిఫ్టుల ద్వారా ఖాళీ చేశారు. అయితే అధికారులు ఆయకట్టు కింద వర్షాకాలానికి లక్షా 31 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. సాగర్‌లో ప్రస్తుతం మూడు టీఎంసీల నీరు అడుగంటిన స్థాయిలో ఉండటంతో రైతులు చలించిపోతున్నారు. కాగా, బోరుబావుల కింద పంటలు సాగుచేసిన రైతులు జోరుగా నాట్లు వేస్తున్నారు.



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

వన మహోత్సవ లక్ష్య సాధనకు కృషి చేయాలి

నిజామాబాద్ అర్బన్, జూలై 5: వన మహోత్సవం కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వనమహోత్సవ కార్యక్రమంపై అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ డీఎఫ్‌వో వికాస్‌మీనతో కలిసి శుక్రవారం సమీక్షించారు. ప్రధానంగా ప్రస్తుతం 2024 సీజన్‌లో ఆయా శాఖల వారీగా వన మహోత్సవంలో భాగంగా నాటాల్సిన మొక్కలకు సంబంధించిన లక్ష్యాలను గుర్తు చేసుకొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేలా చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున విరివిగా మొక్కలు నాటాలని దీనిని ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని నిర్ణీత గడువులోపు లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. లక్ష్య సాధన కోసం అనువైన స్థలాలను గుర్తిస్తూ మొక్కలను నాటడంతో పాటు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని ఏకకాలంలో ఈ పనులను చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాలతో పాటు చెరువులు, కాల్వల కట్టలపై పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటి సంరక్షణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న మూడు వారాల్లోపు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వంద శాతం మొక్కలు నాటాలని గడువు విధించారు. వన మహోత్సవం కార్యక్రమం ప్రగతి గురించి రోజువారిగా నివేదికలు సమర్పించడంతో పాటు వివరాలను వెంటవెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణతో ముడిపడిన వనమహోత్సవ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇస్తూ లక్ష్యాల సాధనకై పకడ్బందీ ప్రణాళికలు రూపొందించుకొని తదనుగుణంగా అంకితభావంతో కృషి చేయాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలని, పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని గ్రామీణ ప్రాంతాల్లో మండల ప్రత్యేక అధికారులను, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ పాలకవర్గాలను భాగస్వాములను చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్షకు హాజరైన అధికారులు





జిల్లాలో మొదలైన బదిలీల ప్రక్రియ

- శాఖల వారీగా సీనియారిటీ జాబితాకు హెచ్‌వోడీల కసరత్తు
- నాలుగేళ్ల సర్వీసు వివరాలను సేకరిస్తున్న అధికారులు
- వెబ్‌ఆప్షన్ల ద్వారా చేపట్టనున్న బదిలీల ప్రక్రియ
- జిల్లాలో 40శాతం ఉద్యోగుల బదిలీకి అవకాశం

నిజామాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ మొదలైంది. ప్రభుత్వ ఆదేశాలతో ఆయా శాఖల అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండేళ్ల సర్వీసు నుంచి నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారందరి వివరాలను సేకరిస్తున్నారు. హెచ్‌వోడీల ఆధ్వర్యంలో వివరాలను తీసుకోవడంతో పాటు సీనియారిటీ జాబితాను ప్రకటిస్తారు. ఆ జాబితాకు అనుగుణంగానే ఉద్యోగులు వెబ్‌ఆప్షన్స్ ఇవ్వగానే 40 శాతం మించకుండా బదిలీలను చేపట్టనున్నారు.

నలభై శాతం ఉద్యోగుల బదిలీకి నిర్ణయం

రాష్ట్ర ప్రభుత్వం ఆరేళ్ల తర్వాత ఉద్యోగుల సాధారణ బదిలీలకు అనుమతి ఇచ్చింది. నలభై శాతం ఉద్యోగులను బదిలీ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా ఆయా శాఖల్లో శుక్రవారం కసరత్తును మొదలు పెట్టారు. శాఖల పరిధిలో నాలుగేళ్లకు పైగా ఒకే చోట పని చేస్తున్న వారి వివరాలను తీసుకుంటున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో నాలుగేళ్లు ఒకేచోట పనిచేసిన వారందరిని బదిలీ చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో వారి వివరాలను ముందుగా సేకరిస్తున్నారు. వీరితో పాటు సంవత్సరంలోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులతో పా టు దీర్ఘకాలికంగా వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలను తీసుకుంటున్నారు. భార్యభర్తలకు సం బంధించిన వివరాలను ఆయా శాఖల హెచ్‌వోడీల ఆధ్వర్యంలో సేకరించేందుకు ఈ కసరత్తును మొదలు పెట్టారు. ఈనెల 8 వరకు సీనియారిటీ జాబితాను తయారు చేయడంతో పాటు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో చర్చిస్తారు. బదిలీ అయ్యే ఉద్యోగుల జాబితాను ఆయా శాఖల్లో ప్రకటిస్తారు. నాలుగేళ్లు పూర్తి చేసిన వారు తక్కువగా ఉంటే రెండేళ్లకు పైగా ఒకచోట పనిచేసిన వారి వివరాలను కూడా తీసుకొని సానియారిటీని తయారు చేసి జాబితాలో ఉంచుతారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఖాళీల జాబితాను ప్రకటించిన మీదట ఈనెల 9 నుంచి 12 వరకు ఉద్యోగుల ఆప్షన్స్‌తో కూడిన దరఖాస్తులను స్వీకరిస్తారు. ప్రతి ఉద్యోగి ఐదు ఆప్షన్ల వరకు ఇచ్చేందుకు అవకాశం కల్పించారు. ఉద్యోగులు ఆప్షన్స్ ఇచ్చిన మీదట హెచ్‌వోడీల ఆధ్వర్యంలో బదిలీల కమిటీ ఈనెల 13 నుంచి 18 వరకు పరిశీలిస్తారు. అన్ని పూర్తయిన తర్వాత ఈనెల 19 నుంచి 20 వరకు బదిలీ ఉత్తర్వులను జారీ చేస్తారు. ఉత్తర్వులు జారీ అయిన తర్వాత మూడు రోజుల్లోనే ఉద్యోగులు చేరే విధంగా ఆదేశాలను ఇవ్వనున్నారు.

సీనియారిటీ ఆధారంగా బదిలీలు

ఈ బదిలీలు జిల్లా, జోనల్, మల్టీజోనల్ పరిధిలో జరుగనున్నాయి. జిల్లా క్యాడర్ పోస్టులన్నీ ప్రస్తుతం చేస్తున్న మండలాల నుంచి మరో మండలానికి బదిలీ చేస్తారు. సొంత మండలం మినహాయించి ఇతర మండలాల్లో అవకాశం కల్పిస్తారు. జోనల్ స్థాయి పోస్టులన్నీ నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో బదిలీలు జరగనున్నాయి. సీనియారిటీ ఆధారంగా ఈ జోన్ పరిధిలో బదిలీలను చేయనున్నారు. జిల్లాస్థాయి క్యాడర్ పోస్టులతో కలెక్టర్ చైర్మన్‌గా, అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖ హెచ్‌వోడీలు సభ్యులుగా ఉంటారు. జోనల్ పోస్టులకు అదనపు లేదా సంయుక్త కార్యదర్శులు, శాఖ హెచ్‌వోడీ సభ్యులుగా ఉంటారు. వారి ఆధ్వర్యంలో జోన్ బదిలీలు జరుగుతాయి. మల్టీజోన్ పరిధిలో జరిగే పోస్టులు రాష్ట్రస్థాయి క్యాడర్ కావడంతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కానీ ముఖ్య కార్యదర్శి కానీ డైరెక్టర్లు సభ్యులుగా ఉండి బదిలీలను చేపడుతారు. ఆరేళ్ల తర్వాత సాధారణ బదిలీలకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో ఎక్కువ మంది సీనియారిటీ ఆధారంగా ఆప్షన్లు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

అనుకూల ప్రాంతాలకు ఉద్యోగుల ప్రయత్నాలు

ప్రభుత్వం బదిలీలకు ఉత్తర్వులు జారీ చేయడంతో శాఖ అధికారులు సీనియారిటీ జాబితా తయారీలో నిమగ్నం కాగా ఉద్యోగులు మాత్రం అనుకూల ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయత్నాలను మొదలు పెట్టారు. అనుకూలమైన ప్రాంతాలకు వెళ్లేందుకు నేతల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. వెబ్‌ఆప్షన్ల ద్వారానే బదిలీలు చేయనుండగా ఉద్యోగులు మాత్రం ప్రయత్నాలను మానడం లేదు. జిల్లాలోని అన్ని శాఖల్లో 40శాతం వరకు ఉద్యోగులు బదిలీ అయ్యేందుకు అవకాశం ఉండటంతో ముందస్తుగా నచ్చిన ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. పైరవీలు అనుకూలంగా లేకున్నా వెబ్ ఆప్షన్ల ద్వారానైనా దగ్గర ప్రాంతాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రస్తుతం అన్ని శాఖల అధికారులు సర్వీస్ ఆధారంగా సీనియారిటీ జాబితాను తయారు చేయడంలో నిమగ్నం కావడంతో లిస్టు వచ్చిన తర్వాత ముమ్మరంగా ప్రయత్నాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

నిజామాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు స్వల్పంగా వరద కొనసాగుతుంది. ప్రాజెక్టులోకి 1620 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1060.90 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో పూర్తిస్థాయి కెపాసిటీ 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 11.44 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో జూన్ ఆరంభం నుంచి ఇప్పటి వరకు 5.330 టీఎంసీల నీళ్లు వచ్చి చేరాయి. ఎగువ ప్రాంతంలో వర్షాలు తగినంతగా పడకపోవడం వల్ల ప్రాజెక్టులోకి భారీ వరదలు ఇప్పటి వరకు నమోదు కాలేదు. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తినా మహారాష్ట్రలో వర్షాలు పడకపోవడం వల్ల వరద రావడం లేదు. గత సంవత్సరం ఇదే సమయానికి ప్రాజెక్టులో 1065.20 అడుగుల నీళ్లు ఉండగా 16.265 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. గత సంవత్సరం కంటే ప్రస్తుతం 5 టీఎంసీలు తక్కువగానే ఉన్నాయి. భారీవర్షాలు పడితే ప్రాజెక్టులోకి వరద కొనసాగే అవకాశం ఉంది.

'ఉద్యోగులకు జీవో 80 ద్వారా తీపి కబురు'

కామారెడ్డిరూరల్, జూలై 5 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీల పై చిరకాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగులకు జీవోనెంబర్ 80 ద్వారా తీపి కబురు ఇవ్వడంపై టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా పక్షాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రివర్గానికి అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి బదిలీలు మల్టీజోన్, జోనల్, జిల్లాస్థాయి బదిలీల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరిగేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియార్టీ జాబితా ఉద్యోగుల ఖాళీల విషయంలో అవకతవకలు జరగకుండా జిల్లా పాలనాధికారి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ బదిలీలలో ఏ ఒక్క ఉద్యోగికి అన్యాయం జరిగినట్లు భావిస్తే వెంటనే టీఎన్జీవోస్ బాధ్యులకు సంప్రదిస్తే వారికి సంఘం తరఫున న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు.

'అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం'

బీర్కూర్, జూలై 5 : హిందువులపై, హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బీజేపీ నాయకులు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో హిందువులు, హింసావాదులు అంటూ వ్యాఖ్యలు చేశారని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలోని కానప్ప చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతినిత్యం హిందువులను లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యోగి, బీరుగొండ, శ్రవణ్, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమావేశం

ఎల్లారెడ్డి, జూలై 5 :ఎల్లారెడ్డి పట్టణంలోని లింగారెడ్డిపేట్ భవన నిర్మాణ కార్మిక ప్రాంగణం వద్ద శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులందరూ ప్రతినెల అమావాస్య రోజున సెలవు దినంగా ప్రకటించుకోవాలని తీర్మానం చేశారు. ఈనెల 7న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమల ఐలన్న జయంతి వేడుకలను ప్రతి గ్రామంలో ఘనంగా జరుపుకోవాలని భవన నిర్మాణ కార్మికులు అన్నారు. కార్మికుల ఐక్యతను చాటాలని ఎవరూ కూడా దొంగచాటున పనిచేయకూడదని తీర్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సాయిలు, శ్యామ్, ఉపాధ్యక్షుడు సాయిలు, కోశాధికారి దుర్గసింగ్, లక్ష్మణ్, గణేష్, రాజు, సిద్ధు, రఫీక్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన తప్పనిసరి

ఎల్లారెడ్డి, జూలై 5 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బ్రిలియంట్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మధుసూధన్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం బ్రహ్మాస్త్రం, వజ్రా యుధం లాంటిదని విద్యాహక్కు చట్టంపై అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం గురించి ప్రతీ విద్యార్థికి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో అయ్యవారి మధుసూధన్, జిల్లా సలహాదారు లింగమయ్య, ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు సమాచార చట్టంపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలు వెంటనే చెల్లించాలి

● ప్రత్యేకాధికారికి కార్మికుల వినతి

రాజంపేట, జూలై 5: పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని శుక్రవారం మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి రోహిత్‌రెడ్డికి కార్మికులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలలో గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కారోబార్ సిబ్బందికి వేతనాలు లేక ఎంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 10 నెలల నుంచి జీతాలు రావాల్సి ఉందని, వెంటనే వచ్చే విధంగా చూడాలని అన్నారు.



ప్రత్యేకాధికారికి వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే చెల్లించాలి

● తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ డిమాండ్

కామారెడ్డి రూరల్, జూలై 5 : బిల్లులు చెల్లించే వరకు అల్పాహారము, కోడిగుడ్లు, రాగిజావా పెట్టబోమని తెలంగాణ మధ్యాహ్నభోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునూరు చక్రపాణి అన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి రాజును కలిసి ఐదునెలల నుంచి బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అల్పాహారము, కోడిగుడ్లు, రాగిజావా పెట్టమని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ఐదునెలల నుంచి బిల్లులు రాక పోవడంతో ఇబ్బందులలో ఉన్నామని, అప్పులకు తెచ్చి సరుకులు తెచ్చామని అన్నారు. మా దగ్గర ఉన్న వస్తువుల్ని తాకట్టు పెట్టి సరుకులు తెచ్చామని, డబ్బులు లేని ఈ పరిస్థితుల్లో పెట్టడం ఎలా అని ప్రశ్నించారు. ఈ ఆందోళనలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, జూలై 5: నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయానికి చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న బీజేవైఎం నాయకులు

బీజేవైఎం నాయకుల కలెక్టరేట్ ముట్టడి

నిజామాబాద్అర్బన్, జూలై5: నిరుద్యోగులకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్‌ను వెంటనే ప్రకటించాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న బీజేవైఎం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. మెగా డీఎస్సీని వెంటనే నిర్వహించాలని, అన్ని నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీని 25వేల పోస్టులతో ప్రకటించాలని, గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలను వెంటనే ప్రకటించాలన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌పై ఊసెత్తడం లేదన్నారు. ఈనెల 8న సీఎం కార్యాలయం ముట్టడిస్తామని ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ ముట్టడికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మద్దతు తెలుపగా బిజెవైఎం నాయకులు సుధీర్ పాల్గొన్నారు.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్టు

ఆర్మూర్‌టౌన్, జూలై5: పట్టణంలోని బీజేవైఎం నాయకులను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. శుక్రవారం దేశవ్యాప్తంగా చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తుండడంతో వారిని స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాబ్‌క్యాలెండర్‌ను విడుదలచేసి మెగా డీఎస్సీని ప్రకటించి 25వేల పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయినవారిలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్, ఉపాధ్యక్షుడు పెద్దోళ్ల భరత్, ఉదయ్‌గౌడ్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

ఖిల్లా: తెలంగాణ ప్రభుత్వం డీఎస్సీని వేసి ఉద్యోగులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా నాయకులను అరెస్టుచేశారు. ఈ సందర్భంగా బిజెవైఎం నాయకుడు రోశన్‌లాల్‌బోరా మాట్లాడుతూ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అక్రమ అరెస్టులు ఆపివేసి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

కంప్యూటర్ ఆపరేటర్‌లపై ఎంపీడీవో ఆగ్రహం

డిచ్‌పల్లి, జూలై5: ప్రజాపాలన దరఖాస్తుల్లో స్వీకరించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయకపోవడం, దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయడంలో కంప్యూటర్ ఆపరేటర్ల నిర్లక్ష్యంపై ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తులు స్వీకరించేందుకు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేయకుండా కాలక్షేపం చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌లపై ఎంపీడీవో రవీందర్ మండిపడ్డారు. దీంతో వెంటనే ఆపరేటర్‌లు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించారు.

రీకౌంటింగ్‌కు షెడ్యూల్ విడుదల

డిచ్‌పల్లి, జూలై5: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఎడ్ రెగ్యూలర్, 1వ సెమిస్టర్, ఏప్రిల్ లో పరీక్షలకు హాజరైన విద్యార్థులు రివాల్యూయేషన్, రికౌంటింగ్ కోసం జూలై 11 లోపు ప్రతీ పేపర్ కు రివాల్యూయేషన్ రూ.500, రికౌటింక్ 300 చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని సీవోఈ అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యూలర్, బి.పి.ఎడ్ 1,3వ సెమిస్టర్ మార్చ్‌లో జరిగిన పరీక్షలకు హాజరైన విద్యార్థులు రివాల్యూయేషన్, రికౌటింగ్ చేసుకోవలంటే 11లోపు రివాల్యూయేషన్‌కు 500, రికౌటింగ్‌కు 300 చెల్లించాలని అరుణ తెలిపారు.

డిచ్‌పల్లిలో ఆధార్ సెంటర్ ఏర్పాటు

డిచ్‌పల్లి, జూలై 5: గత నెలలో ఆధార్ సెంటర్ లేకా అవస్థలు పడుతున్న ప్రజలు అనే వార్త 'ఆంధ్రజ్యోతి' మినీ ఎడిషన్‌లో వార్త రావడంతో సంబంధిత అధికారులు డిచ్‌పల్లిలో మూసుకున్న ఆధార్ సెంటర్‌ను పునరుద్ధరించారు. ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజలకు ఆధార్ సెంటర్ ప్రారంభం కావడంతో ఎంతో వెసులుబాటు తప్పిందని ఆధార్ పనుల కోసం దూరం వెళ్లే పరిస్థితి తగ్గించినందుకు 'ఆంధ్రజ్యోతి'కి ధన్యవాదాలు తెలిపారు.

బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, జూలై5: తెలంగాణ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల పరిధిలోని వన్‌టైం చాన్స్ (సీబీసీఎస్) బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, కోర్సులకు చెందిన 5,6, సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షలు 4వ రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. గిరిరాజ్ కళాశాల నిజామాబాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కే బాన్సువాడ డిగ్రీ కళాశాల, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఆర్మూర్ కేంద్రాల్లో జరిగిన పరీక్షకు ఉదయం 156మంది విద్యార్థులకు 145 మంది హాజరయ్యారు. 11మంది గైర్హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 22 మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు.

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యం

డిచ్‌పల్లి, జూలై5: తెలంగాణ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎంబీఏ, విద్యార్థులు ట్రెజర్ హంట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు మైండ్‌గేమ్ ఆడారు. ఈ సందర్భంగా ప్రొ.ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు చదువుతోపాటు మైండ్ గేమ్ ఆటలు కూడా ముఖ్యమేనని క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఈ సందర్భంగా జాస్మిన్, శివాని, శ్వేత లను అభినందించారు. విజేతలుగా మధు, భాగ్యశ్రీ, సుమిత్, శ్రావణిలు గెలిచారు. ఈ కార్యక్రమానికి అధ్యాపకులు ఖైసర్, కిరణ్, రాంబాబు, శ్రీనివాస్, డా.శ్వేతా పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్‌లో స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికలు

నవీపేట, జూలై5: జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ పాఠశాలలో శుక్రవారం స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. 9వ తరగతికి చెందిన ఇద్దరు హెడ్‌బాయ్, నలుగురు హెడ్ గర్ల్ కోసం పోటీలలో పాల్గొన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి చదివేవిద్యార్థులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్య గౌడ్, సీఈవో హరితా గౌడ్, ప్రిన్సిపాల్ భాస్కర్‌లు సైతం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

ఎస్సీ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

మోర్తాడ్, జూలై5: మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం మాదరి అన్నపూర్ణ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాదరి రాజన్న మండలంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్సీ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, ఎంపీడీవో తిరుమల, వేవో లావణ్య, మండల పీఆర్‌టీయు అధ్యక్షుడు మగ్గిడి ప్రవీణ్, ప్రగతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన ఎంవీఐ

రెంజల్, జూలై5: సరైన ధృవపత్రాలు లేని వాహనాలు నడిపితే చర్యలు తప్పవని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ ముందు వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన ధృవపత్రాలు లేని వాహనాలకు జరిమాన విధించారు. ప్రతీఒక్కరు హెల్మెట్ తప్పనిసరి ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని లేనియెడల వాహనాలను జరిమానాలు విధిస్తామని అన్నారు. ఆయన వెంట సీఐలు చందర్ రాథోడ్, నరేష్ కుమార్, ఎస్ఐ సాయన్న, ఏఎస్ఐ బాబురావు, సిబ్బంది శ్రీనివాస్ ఉన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఎత్తిపోతలు కాదు.. ఉత్తిపోతలే!

● పనిచేయని బర్దిపూర్ లిఫ్ట్ ● 2వేల ఎకరాలకు అందని సాగునీరు ● మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న రైతాంగం


మూలన పడిన బర్దిపూర్ లిఫ్ట్


ట్రాన్స్‌ఫార్మార్ లేక ఖాళీగా విద్యుత్ సబ్‌స్టేషన్


వృథాగా ఉన్న పంపు హౌజ్

డిచ్‌పల్లి, జూలై5: ఒకవైపు వర్షాలు లేక ఆకాశంవైపు చూస్తున్న రైతాంగానికి బర్దిపూర్ లిఫ్ట్ ఆయకట్టు రైతులకు గుదిబండాల మారింది. ఆదుకుంటుదన్న లిఫ్ట్ చెడిపోయి మూలన పడటంతో అన్నదాతలు అన్నమోరామచంద్ర అనే పరిస్థితులు దాపురించింది. మండలంలోని బర్దిపూర్ ఎత్తిపోతల పథకం 2వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు గతంలో కాంగ్రెస్ హయంలో ఈ ఎత్తిపోతల పథకం ప్రారంభించారు. ఈ లిఫ్ట్ పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పూర్తిగా నిరుపయోగంగా మారి మూలన పడింది. కోట్లాది రూపాయలతో రైతాంగానికి సాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఎత్తిపోతల పథకం ఆలనపాలన కరువైంది. ఎత్తిపోతలతో నమ్ముకున్న రైతాంగం ఆశలు అడియాశలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ లిఫ్ట్ ద్వారా బర్దిపూర్, ధర్మారం, కమలాపూర్, ఘన్‌పూర్, మిట్టపల్లి, బీబీపూర్, గ్రామాల రైతుల ఆశాలు సన్నగిల్లాయి. లిఫ్ట్ 5ఎంవీ ట్రాన్స్‌ఫార్మార్ కాలిపోయి ఏడాదిన్నర గడిచిన ఇంత వరకు విద్యుత్ శాఖ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మార్ బిగించకపోవడంతో ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. ఎత్తిపోతల పర్యవేక్షణ అధికారులు తమకేమి పట్టన్నట్లు వ్యవహరించడం తో విలువైన మోటార్లు పనిచేయకుండా మూలన పడ్డాయి, ఇప్పటికే దొంగలు ఇనుపగేట్‌లను చోరీ చేయగా కొంత మంది ఎత్తిపోతల పథకం వద్ద పేకాట స్థావరంగా మార్చుకున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలోని పాలకులు స్పందించి లిఫ్ట్‌ని పునర్ నిర్మాణం చేయాలని, లిఫ్ట్‌ద్వారా సాగునీరు అందేలే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. గతంలో కాంగ్రెస్ నిర్మించిన లిఫ్ట్‌ను బీఆర్ఎస్ పట్టించుకోలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున లిఫ్ట్‌ను పునర్‌నిర్మాణంచేసి ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తారని చూస్తున్నారు.

'కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి'


ఎండీకు వినతి పత్రం అందిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

బోధన్‌రూరల్, జూలై5: బోధన్ పట్టణంలోని నిజాంషుగర్స్ ఫ్యాక్టరీలో విధులు నిర్వహించిన కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ మల్సూర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు లేఆఫ్ పిరియడ్‌కు సంబంధించిన వేతనాలు ఇప్పించాలని ఫ్యాక్టరీ పునరుద్ధరణలో భాగంగా రోల్‌లో ఉన్న కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎండీ సానుకూలంగా స్పందించినట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఉపేందర్, కళ్యాణ్, మెదక్ యూనిట్‌కు చెందిన కార్మిక సంఘాల నాయకులు శంభు ప్రసాద్, నరహరి, జనార్ధన్ రెడ్డి, ముక్త్యార్, రాజయ్య తదితరులున్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్యాయత్నం

నవీపేట, జూలై5: నిజామాబాద్‌కు చెందిన ఓ మహిళ శుక్రవారం తన ఇద్దరుపిల్లలతో కలిసి మండలంలోని యంచ గోదావరిలో దూకి ఆత్మహత్యా యత్నానికి ప్రత్నించింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. 12 ఏళ్ల కుమార్తె, 8 ఏళ్ల కుమారుడితో కలిసి మహిళ యంచ గోదావరిలో దూకాడానికి యత్నించింది. ఇదే సమయంలో మండలంలోని మిట్టాపూర్ మాజీ సర్పంచ్ అనిత భర్త సతీష్, ఫకీరాబాద్‌కు చెందిన రాజులు వారిని అడ్డుకున్నారు. అనంతరం బాధితులను బాసర పోలీసులకు అప్పగించారు. తన భర్త మేస్త్రీ పని చేస్తాడని, తరుచూ గొడవ పడడంతో మనస్థాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు మహిళ పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఏడుగురు విద్యార్థిల ఎంపిక

ముప్కాల్, జూలై5: బాల్కొండ మండలంలోని మోడల్‌స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సానుకూల కీర్తన, సంకెల రుచిత, మ్యాక సాగరిక, శ్రీచైతన్య, మాసం రక్షిత, శరణ్య, లక్ష్మీదేవిలు ప్రిన్సిపాల్ శంకర్ అభినందించారు. భవిష్యత్ మరిన్ని ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించే దిశగా కృషి చేస్తామని అన్నారు.

ఆర్మూర్ మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా డీసీవో శ్రీనివాస్

ఆర్మూర్‌రూరల్, జూలై5: ఆర్మూర్ మండల ప్రజాపరిషత్ ప్రత్యేక అధికారిగా నిజామాబాద్ జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ పాలకవర్గం పదవీ కాలం పూర్తి కావడంతో డీసీవో శ్రీనివాసును ఆర్మూర్ మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా నియామిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆయన ఆర్మూర్ మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో సాయిరాం, ఎంపీవో శ్రీనివాస్, ఎంఈవో రాజగంగారాంలు డీపీవో శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సూపరిండెంట్ లక్ష్మీ, ఏపీవో సురేష్, ఏపీఎం గంగారాం, మండల పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బోధన్ మండల ప్రత్యేక అధికారిగా తరుణ్ కుమార్

బోధన్‌రూరల్, జూలై5: బోధన్ ప్రత్యేక అధికారిగా జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నవీపేట, జూలై5: మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. విషజ్వరాలపై అశ్రద్ధ చేయవద్దని, స్థానిక వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నవీపేట ప్రభుత్వ ఆసుపత్రి హెచ్‌ఈవో వెంకటేశ్వర్ రావు, పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, ఏఎన్ఎంలు, ఆశా పాల్గొన్నారు.

జాతీయ హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సిరికొండ జూన్5: ఈనెల 10 నుంచి 17 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకేంద్రంలో జరిగనున్న జాతీయ హాకీ క్రీడల పోటీలకు సిరికొండ మండలం తూంపపల్లి హైస్కూల్ కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నగేష్ తెలిపారు. హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జూన్ 23న తెలంగాణ హాకీ అసోసియేషన్ వారు నిర్వహించిన సౌత్ జోన్ జూనియర్ నేషనల్ హాకీ క్రీడాకారుల ఎంపిక పోటీలలో తూంపల్లి హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు అక్షయ, రాజశ్రీ, శ్రీజా, మనోజ్, నితిన్ ఎంపికయ్యారని నగేష్ పేర్కొన్నారు. జాతీయ హాకీపోటీలకు తూంపల్లి విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించడానికి ఎంపిక కావడంపై హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, కార్యదర్శి రమణ, తూంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు.

'ప్రభుత్వాన్ని ఒప్పించి ఉపాధ్యాయులను రిలీవ్ చేయించే బాధ్యత పీఆర్‌టీయూదే'

సిరికొండ, జూన్5: జిల్లాలో బదిలీఅయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయడానికి ప్రభుత్వాన్ని ఒప్పించే బాధ్యత పీఆర్‌టీయూ సంఘం బాధ్యత తీసుకుంటుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మూషీర్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు పదోన్నతిపై కొండపూర్ హైస్కూల్‌కు వెళ్తున్న మోజీరాంను శుక్రవారం పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమానికి మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు నరహరి, పాఠశాల కాంప్లెక్ ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, గ్రామాభివృద్ధి కమిటీ సభయలేరవి, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

మేకల మందపై చిరుత పులి దాడి

● ఘటనా స్థలాన్ని పరిశీలించిన అటవీశాఖ అధికారులు

నవీపేట, జూలై 5: మండలంలోని కమలాపూర్ సమీపంలో శుక్రవారం మేకల మందపై చిరుత పులి దాడి చేసింది. నవీపేటలోని గాంధీకి చెందిన మేకల పెంపకందారుడు తన మేకలను అటవీ ప్రాంతంలో మేపుతుండగా బండరాళ్ల మధ్య నుంచి వచ్చిన చిరుత పులి మేకల మందపై దాడిచేసింది. వెంటనే భయంతో పరుగులు పెట్టిన గాంధీ సంబంధిత విషయాన్ని గ్రామస్థులకు సమాచారం అందించాడు. దీంతో సంఘటన స్థలానికి అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ జహూర్, బీట్ ఆఫీసర్‌లు సుధీర్, విజయరాణిలు పరిశీలించారు. కెమెరా ట్రాప్‌తో చిరుత పులి సంచరాన్ని తెలుసుకుని త్వరలో బోను ఏర్పాటు చేస్తామని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. చిరుత దాడిలో ఓ మేకకు తీవ్ర గాయాలయ్యాయి.


చిరుత దాడిలో గాయపడ్డ మేక


నీటిని పరిశీలిస్తున్న అధికారి

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్

పెద్దబజార్, జూలై 5: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. శుక్రవారం నగరంలోని వినాయక్‌నగర్ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం సమీపంలో గాయత్రీనగర్‌నందు క్షేత్రస్థాయిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్ద గల కూలర్లలో నీటి నిల్వ, నీటితొట్టెలలో దోమల లార్వాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటినిల్వలను తొలగించాలని డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగునీరు, ప్లాస్టిక్ చెత్తచెదారాన్ని తొలగించాలని అన్నారు. ఇంటి పరిసరాల్లో వాడి పాడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, కప్పులు, కుండలు, పాత టైర్లు, డబ్బాలు తదితర వ్యర్థాలను మొదలగు వాటిలలో నీరు నిలువకుండా వాటిని తొలగించాలన్నారు. అదేవిధంగా ఇళ్లలో వాడేటువంటి కూలర్లు, నీటి తొట్టిలు, సంపులు ప్రతీ శుక్రవారం శుభ్రంగా కడిగి ఎండబెట్టి మరుసటిరోజు నీటిని పట్టుకోవాలని అన్నారు. లేనిచో డెంగీ దోమలు అందులో పెరిగి ఇళ్లలో నివసించేవారికి కుట్టడంతో డెంగీ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందన్నారు. మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు ప్రాబలకుండా జాగ్రత్తపడాలన్నారు. డొమాస్టిక్, పెరిడొమాస్టిక్ నీటి నిల్వలను తొలగిస్తూ యాంటిలార్వాలను స్ప్రే చేయాలని, దోమ తెరలను వాడుతూ, కిటికీ జాలీలను అమర్చుకోవాలన్నారు. ప్రతీ ఆదివారం ఉదయం 10.10లకు ప్రతీ ఇంటి వద్ద నీటి నిల్వలను తొలగిస్తూ పరిసరాల పరిశుభ్రతను పాటించినప్పుడే దోమల నియంత్రణ జరుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా జిల్లా ప్రజలందరూ వైద్యసిబ్బందికి ఆశలు, ఏఎన్ఎంలకు సహకరిస్తూ డివిజన్‌లో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రించాలని, అదేవిధంగా నీటి కాలుష్యం జరుగకుండా ప్రతీరోజు క్లోరినేషన్ చేసిన నీటిని వాడాలని అన్నారు. మిషన్‌భగీరథ నీటిని ఉపయోగించాలని, ఐఎస్ఐ మార్క్ కలిగిన వాటర్‌ప్లాంట్ నీటిని వాడాలన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు శాంతకుమారి, ఏఎన్ఎం విట్టబాయి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుపై కేజీవీల్ నడిపితే చర్యలు: ఎంపీడీవో

నవీపేట, జూలై5: రోడ్లపై కేజీవీల్స్‌తో కూడిన ట్రాక్టర్లు నడిపితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీడీవో నాగనాథ్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బినోలలో ట్రాక్టర్ యాజమానులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తమ కేజీవీల్స్ ట్రాక్టర్లకు పట్టీలు అమర్చుకుని రోడ్లపై నడపాలని లేనట్లయితే కేసులు నమోదు చేయడంతో పాటు జరిమాన విధించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ యాదగిరి గౌడ్, పంచాయతీ రాజ్ డీఈ రాజయ్య, ఏఈ శ్రావణ్ కుమార్. ఆర్ఐ ప్రవీణ్, విజయ్, తదితరులున్నారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

ముప్కాల్, జూలై5: బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన రాడ రాజేశ్వర్ (68) కడుపునొప్పి భరించలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బాల్కొండ ఎస్సై యాసిర్ అర్ఫాత్ తెలిపారు. మృతుడు రాడ రాజేశ్వర్ గత కొంతకాలంగా మద్యంకు అలవాటు పడి గతవారం నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడని, దీంతో జీవితంపై విరక్తి చెందిన గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్ళి శ్రీరాంపూర్ గ్రామశివారులో గల వ్యవసాయ తోటలో మామిడిచెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి భార్య రాడ గంగనర్సు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాసిర్‌అర్ఫాత్ తెలిపారు.

జిల్లాస్థాయి పోటీల్లో ముప్కాల్ విద్యార్థుల ప్రతిభ

ముప్కాల్, జూలై5: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్‌జీసీ జిల్లా ఆధ్వర్యంలో గోడప్రతుల తయారీ, కవిత పోటీలలో ముప్కాల్ ప్రభుత్వపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలు రాజశ్రీ, మహిలు జిల్లాస్థాయి ద్వితీయ బహుమతిని సాధించగా వారికి సర్టిఫికెట్‌లను అందజేసి అనంతరం ప్రధానోపాధ్యాయుడు గంగారాం అభినందించారు.

దివ్యాంగ విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ

జక్రాన్‌పల్లి, జూలై5: మండలకేంద్రంలోని జక్రాన్‌పల్లిలో ఇంద్రనగర్, ఉర్దూ మీడియం ప్రైమరీ పాఠశాల, శుభోదయం పాఠశాలలో శుక్రవారం దాత, తాజామాజీ ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి దివ్యాంగ విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పలకలు పంపిణీ చేశారు. శుభోదయం పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పలకలు, పెన్నులు పంపిణీచేశారు. కార్యక్రమంలో శుభోదయం పాఠశాల ఉపాధ్యాయులు శ్రీరాం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్, జూలై5: మున్సిపల్ పరిధిలోని 23వార్డులో యుపీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డెంగ్యు, మలేరియా, ఫైలేరియా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసర ప్రాంతంలో నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె తెలిపారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్, యూనిట్ అధికారి సాయి, బట్టు ఆనంద్, శానిటరి ఇన్‌స్పెక్టర్ మహేష్, పూర్ణమహేష్, ఎంఐఎం నాయకులు జహీర్ పాల్గొన్నారు.


నిల్వ ఉన్న నీటిని పారేస్తున్న దృశ్యం

బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో..

నిలిచిన ప్రసూతి సేవలు!

● వేధిస్తున్న వైద్యుల కొరత ● సిబ్బంది లేక ఆగిన స్కానింగ్ సేవలు ● వారం రోజులుగా ప్రసూతి సేవల్లేవ్!



బోధన్ ప్రభుత్వ ఆసుపత్రి

బోధన్ రూరల్, జూలై 5: బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఆసుపత్రిలో వసతులు ఉన్నా వైద్యం అందించేందుకు పూర్తిస్థాయి సిబ్బంది లేక రోగులు, గర్భిణీలు, చిన్నారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి నిర్వహణ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైందని ప్రజలు పేర్కొంటున్నారు. ఆసుపత్రి నిర్వహణను పర్యవేక్షించే ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని, ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ఉన్నతాధికారులు విలఫలమవుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● నిలిచిన ప్రసూతి సేవలు

బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో వారం రోజులుగా ప్రసూతి వైద్య సేవలు నిలిచిపోవడంతో గర్భిణి స్త్రీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేరుకే జిల్లా ఆసుపత్రి ఉన్న ప్రసూతి విభాగంలో వైద్యుల కొరత తీవ్రంగా నెలకొంది. ప్రసూతి విభాగంలో ఉన్న ప్రతీ గైనకాలజిస్టు డాక్టర్ సుభాంగిని వారం రోజులుగా రాకపోవడంతో ప్రసూతి విభాగంలో కాన్పులు ఆగిపోయాయి. అనుభవం ఉన్న స్టాఫ్ నర్సులు ప్రసూతి విభాగంలో సేవలందిస్తున్నారు. కాన్పుకు వచ్చిన మహిళలకు దాదాపు నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి పంపిస్తున్నారు. సాధారణ కాన్పులను మాత్రమే చేస్తూ అత్యవసర శస్త్ర చికిత్సలు చేయకపోవడంతో గర్భిణీ స్త్రీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రసూతి విభాగంలో ఇది వరకు ఇద్దరు, ముగ్గురు వైద్యులు ఉండి సేవలు అందించే వారు. సుమారు వారం రోజుల క్రితం విధుల్లో ఉన్న గైనకాలజిస్టు వైద్యురాలు వెళ్లిపోవడంతో ప్రసూతి విభాగంలో సమస్యలు మొదలయ్యాయి.

● సిబ్బంది లేక నిలిచిన స్కానింగ్ వైద్య సేవలు

శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి అవసరమయ్యే ఎన్నో పరికరాలు ఆసుపత్రిలో ఉన్నాయి. ఆసుపత్రులకు స్కానింగ్ యంత్రాలు సమకూర్చిన గత ప్రభుత్వం వాటిని నడిపించే రేడియాలాజిస్టులను నియమించలేదు. దీంతో స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. ఫలితంగా గర్భిణీలు స్కానింగ్ కోసం ప్రైవేట్ సెంటర్‌లకు వెళ్తున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవ సేవలను అందించడంలో భాగంగా గర్భిణీలకు అవసరమైన స్కానింగ్ చేయడానికి ప్రభుత్వం గతంలో స్కానింగ్ యంత్రాలను కేటాయించింది. అయితే ఆసుపత్రిలో స్కానింగ్ యంత్రాలు ఉన్న రేడియాలాజిస్టు లేక వృథాగా మారాయి.


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

● డీఈవో దుర్గాప్రసాద్

మోపాల్, జూలై5: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి మార్కులు తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని సిర్పూర్ ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్‌పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధ్యాయులు కష్టపడి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి మార్కులు సాధించాలని సూచించారు. అన్ని తరగతులను మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా డీఈవోను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్బర్ భాషా, వందన, హజారే, శ్రీనివాస్, లాటికర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ముదక్‌పల్లిలో ప్రజలకు వైద్య పరీక్షలు

మోపాల్, జూలై5: మండలంలోని ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, సూర్య ఆరోగ్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కులాస్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 107 మందికి ఉచిత బిపి, షుగర్, మలేరియా పరీక్షలు నిర్వహించి అవసరమైన వాటికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఎవరైనా తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారిని ఆసుపత్రికివచ్చి పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. శిబిరంలో డాక్టర్‌లు సంతోష్‌కుమార్, ప్రత్యూష, భూలక్ష్మి, గంగాధర్, సూర్య ఆరోగ్య సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ వినోద్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కమ్మర్‌పల్లి, జూలై5: వర్షకాలం దృష్ట్యా దోమలు పెరిగి రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతీఒక్కరు పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని చౌట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సుప్రియ అన్నారు. మండలంలోని చౌట్‌పల్లిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షపు నీరు ఇళ్లలో గాని, వీధుల్లో గాని నిల్వ ఉండకుండా జాగ్రత్తలు చేపట్టాలని, నిల్వ ఉన్న నీటిలో లార్వా పెరిగి దోమలుగా మారి హాని కలిగిస్తాయని వివరించారు. మండంలోని బషీరాబాద్‌లో హెచ్‌వో త్యనారాయణ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. దోమలతో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యాలాంటి వ్యాధులు ప్రబలి హానికలిగిస్తాయని, నీటి నిల్వవల్లే దోమలు వ్యాపిస్తాయని తెలిపారు. సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీని సన్మానించిన అంగన్‌వాడీలు

ధర్పల్లి, జూలై 5: తాజా మాజీ ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డిని మండల అంగన్‌వాడీలు ఘనంగా సన్మానించారు. శుక్రవారం సారిక నివాసంలో మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడిలు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సారిక మాట్లాడుతూ తన హయాంలో అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మించామని అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేశానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల అంగన్‌వాడీలు వనజ, లక్ష్మి, ప్రమీల, రాధ, తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి'

జక్రాన్‌పల్లి, జూలై5: తమకు కావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అప్పటివరకు విద్యార్థులకు అల్పాహారం, కోడిగుడ్లు, రాగిజావా పెట్టబోమని శుక్రవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులు శుక్రవారం ఎంఈవో శ్రీనివాస్‌ను వినతిపత్రం అందజేశారు. గత 5నెలల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులకు నిధులు రాకపోవడంతో మధ్యాహ్న భోజనకార్మికులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కింగ్ యూనియన్ ఏఐటీయుసీ రాష్ట్రఉపాధ్యక్షుడు చక్రపాణి ఎంఈవోకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రావాల్సిన బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు స్రవంతి, లక్ష్మీ, గంగామణి, సత్యనారాయణ, రాధ, తదితరులు ఆపల్గొన్నారు.

రోటరీక్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

నిజామాబాద్ అర్బన్, జూలై5: రోటరీక్లబ్ ఆఫ్ నిజామాబాద్ 72వ కార్యవర్గ ప్రమాణస్వీకారం శుక్రవారం నగరంలోని న్యాల్‌క ల్ రోడ్‌లో గల రోటరీ కమ్యూనిటీ సెంటర్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ జిల్లా 3150 గవర్నర్ శరత్‌చౌదరి, డిప్యూటీ గవర్నర్ ఆకుల అశోక్, మాజీ గవర్నర్ గౌతం, జెడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, అసిస్టెంట్ గవర్నర్ జ్ఞానప్రకాశ్ హాజరయ్యారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా విజయరావు, గంగారెడ్డి, ఇతర కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి రోటరీ ప్రతినిధులు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, ఇన్నర్‌వీల్ చైర్మన్ ప్రేమలత, కోశాధికారి భరత్‌పటేల్, ధీరజ్‌రెడ్డి, రాజ్‌కుమార్ సుబేదార్, కమల్ ఇనాని, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

● శానిటేషన్, రెవెన్యూ శాఖల జాయింట్ సర్వే ● కమర్షియల్‌గా వాడుతున్న ఇళ్లకు నోటీసులు


హోటల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు


కొలతలు చేస్తున్న అధికారులు

సుభాష్‌నగర్, జూలై5: మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నగరంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. శుక్రవారం ఉదయం నుంచి నగర పాలక సంస్థ కమిషనర్ మందమకరంద్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని బైపాస్ రోడ్‌లోగల పలు సంస్థల భవనాలకు నోటీసులు జారీ చేశారు. అనుమతి లేకుండా కమర్షియల్‌గా వాడుతున్న వాటిని గుర్తించి వాటి ట్రేడ్ లైసెన్సు లేకపోవడంతో నోటీసులు అందజేశారు. కొన్ని భవనాలకు ట్రేడ్ లైసెన్సులకు సంబంధించిన కొలతలు సరిగా లేకపోవడంతో డిప్యూటీ కమిషనర్ సమక్షంలో కొలతలు కొలిచి నోటీసులు జారీ చేశారు. అనంతరం కంఠేశ్వర్ బైప్‌పాస్‌లోగల ఓ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లో సరైన శుభ్రత పాటించకపోవడంతో హోటల్‌కు జరిమానా విధించారు. నగరంలో ఇప్పటినుంచి ప్రతీరోజు తనిఖీలు ఉంటాయని, శుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిద్ అలీ, రెవెన్యూ అధికారులు నరేందర్, శ్రీనివాస్, అశోక్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ పెంచాలని ధర్నా

నిజామాబాద్ అర్బన్, జూలై5: దివ్యాంగుల పెన్షన్ పెంచాలని కోరుతూ వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలు చేయడంతోపాటు వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, గీత కార్మికులకు రూ.4వేల పెన్షన్ చేయాలని వారు డిమాండ్‌చేశారు. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌లను పెంచాలని వీహెచ్‌పీఎస్ జాతీయ మహిళా అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. ధర్నాకు ఎంఆర్‌పీఎస్ అన్ని అనుబంధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లాఅధ్యక్షుడు సరికెలపోశెట్టి, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనకప్రసాద్, గంగాధర్, బాలు, భూమయ్య పాల్గొన్నారు.

పసుపు పంటపై రైతులకు అవగాహన

ఆర్మూర్‌రూరల్, జూలై5: ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామంలో రైతులకు పసుపు పంటపై వ్యవసాయ శాస్త్రవేత్తలు శుక్రవారం అవగాహన కల్పించారు. పసుపు పంటలో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు, అంతర పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ పసుపు పంటలో తెగులు సోకిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపడితే రైతులకు అధిక దిగుబడులు వస్తాయన్నారు. భూసార పరీక్షలు చేయించుకొని ఫలితాలకు అనుగుణంగా ఎరువులను వాడాలని సూచించారు. అంతకుముందు గ్రామంలో పసుపు పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో కోర మండల ఫర్టిలైజర్ జోనల్ మేనేజర్ మనోజ్, డివిజనల్ ఆగ్రోనామెస్ట్ సుధా కర్‌రెడ్డి, సీనియర్ అగ్రోనామెస్ట్ పపిరెడ్డి, మార్కెటింగ్ అధికారి మహేశ్వర్‌రెడ్డి, చిన్నారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి, బ్రహ్మణ్‌పల్లిలో వన మహోత్సవం

జక్రాన్‌పల్లి, జూలై5: శుక్రవారం జక్రాన్‌పల్లి, బ్రహ్మణ్‌పల్లిలో గ్రామప్రత్యేక అధికారి బ్రహ్మనందం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటి నీళ్ల పోశారు. వన మహోత్సవంలో ప్రతీఒక్కరు పాల్గొని మొక్కలు నాటాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థికి సన్మానం

కమ్మర్‌పల్లి, జూలై 5: కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతు 10 జీపీఏ సాధించి మండల టాపర్ ప్రస్తుతం బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సంధించుకున్న విద్యార్థి ఎండీ ఫైజన్‌ను శుక్రవారం కమ్మర్‌పల్లి మజీద్ కమిటీ తరఫున సన్మానించారు. కార్యక్రమంలో మజీద్ కమిటి అధ్యక్షుడు అహామద్ హుసేన్, యాకూబ్, ఛోటుమియా, తమీమ్, సలావుద్దీన్, సల్మాన్‌ఖాన్, బిలాల్, జాకిర్, మహామ్మద్, రేహన్‌ఆలం, మహిమూద్, సయ్యాద్, తదితరులున్నారు.

ఈతమొక్కలు నాటిన ఎక్సైజ్ అధికారులు

ఇందల్వాయి, జూలై5: 75వ వనమహోత్సవాన్ని పురస్కరించుకొని ఇందల్వాయి మండలంలోని లోలం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు వెయ్యి ఈత మొక్కలు నాటినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వేణుమాధవరావు తెలిపారు. ఈతమొక్కల వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని ఈతమొక్కలు పెరిగిన తర్వాత మంచి ఆదాయాన్ని ఇస్తాయని అన్నారు. ప్రతీ గ్రామంలో గౌడ కులస్తులు పెద్ద ఎత్తున ఈతమొక్కలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ ఫయాజ్, మహేష్, జగదీశ్, గ్రామపంచాయతీ కార్యదర్శి సువర్ణ, లోలం గ్రామస్థులు ఉన్నారు.

'విద్యారంగ అభివృద్ధి కోసం సమరశీల పోరాటం'

పెద్దబజార్, జూలై5: విద్యారంగ అభివృద్ధికి సమరశీల పోరాటం నిర్వహించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ సామాజిక వేత్త మాడిశెట్టి అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల్లో చేరడం శుభసూచకమని నిరంతరం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సమరశీల పోరాటాన్ని నిర్వహించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని లేనిపక్షంలో ఎమ్మెల్యేల ఇంటి ముందు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తిరుపతి, సూరి, సంజయ్, నాగరాజు, గణేష్, సోని, ఆశీర్వాదం పాల్గొన్నారు.

బాల్కొండలో వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

ముప్కాల్, జూలై5: బాల్కొండ మండల కేంద్రంలోని వన్నెల్(బి) చౌరస్తా వద్ద ఆర్మూర్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు, లైసెన్స్, హెల్మెట్, ట్రిపుల్ రైడింగ్ చేసిన వాహనాలను తనిఖీచేశారు. వాహనాలు తప్పనిసరి హెల్మెల్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని అన్నారు. వాహనాల ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పని సరిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేష్, బాల్కొండ సీఐ శ్రీధర్‌రెడ్డి, బాల్కొండ ఎస్సై యాసిర్ హర్ఫాత్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడదాం


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే, అధికారులు

సుభాష్‌నగర్,జూలై5: ప్రతీఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. జిల్లాకేంద్రంలోని సారంగపూర్ అర్బన్ పార్క్‌లో శుక్రవారం వజ్రోత్సవ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం పర్యావరణం అన్నారు. అటువంటి పర్యావరణం మొత్తం కాలుష్యమవుతుందని అన్నారు. భారతదేశంలో ఔషధ గుణం ఉన్న చెట్లు అరటి, రావి, తులసి, మర్రి, మామిడి, వేప వంటి చెట్లను పెరట్లో పెట్టుకొని పూజించేవారిమన్నారు. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదక మానవజాతి మనుగడకే ప్రమాదమని, దీని ప్రభావం పర్యావరణంపై పడుతోందని అన్నారు. 2018 నుంచి 2002 వరకు దేశరాజధానిలో 10లక్షలకు పైగా నీడనిచ్చే ఔషధ మొక్కలు నాటినట్లు తెలిపారు. అమ్మ పేరు మీద ప్రతీఒక్కరు ఓ మొక్క నాటాలని ప్రధా ని మోదీ పిలుపునిచ్చారని, దీన్ని అందరూ ఆచరించాలని కోరారు. పట్టణాల్లో కాలుష్యం నానాటికి పెరిగిపోతుందని, భవిష్యత్తు తరాలు బాగుండాలంటే కాలుష్యరహిత సమాజాన్ని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి వికాస్‌మీన, డివిజనల్ అటవీశాఖ అధికారి సుధాకర్‌రావు, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు పద్మారావు, రాధిక, పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో..

పెద్దబజార్: నగరంలోని బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మొక్క నాటారు. దేశవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలందరూ అమ్మపేరు మీద ఓ మొక్కను నాటాలనే పిలుపునివ్వగా.. శుక్రవారం మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. భారతదేశం మొదటి వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారని జనసంగ్ వ్యవస్థాపకులైన ముఖర్జీ దేశ సమగ్ర ఐక్యత కోసం హిందువులలో భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను పెంపొందించారని అన్నారు. ఆ మహనీయుడి త్యాగానికి గుర్తుగా బలిదాన్ దివాస్ జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, నాయకులు సుధీర్, వినోద్, రాజశేఖర్‌రెడ్డి, బద్దం కిషన్, వీరేందర్, అంబదాస్, పల్నాటి కార్తిక్, మాస్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు హైకోర్టు జడ్జీల రాక

నిజామాబాద్ అర్బన్, జూలై5: తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనేందుకు హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్‌పాల్ శనివారం జిల్లాకు రానున్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టులో జరిగే కార్యక్రమంలో మరో హైకోర్టు జడ్జి పి.శ్రీసుధ హాజరుకానున్నారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సిహెచ్ పంచాక్షరి హాజరుకానున్నారు. ఉదయం 10.30లకు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించే సెమినార్‌లో వారు పాల్గొననున్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూలై 5: డిగ్రీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నిజామాబాద్ మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సత్యనాథ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉండాలని, టీజీఆర్‌డీసీ సెట్-2024 రాసిన వారు, రాయని వారు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం బీఏ(ఇహెచ్), బీకాం (సీఏ), బీకాం (బీఏ), బీఎస్సీ (బీజెడ్‌సీ),(ఎన్‌జెడ్‌సీ), (ఎంపీసీఎస్), (ఎంఎస్‌సీఎస్), (ఎంఎస్‌డీఎస్) గ్రూపులకు స్పాట్ అడ్మిషన్ 8న తేదీన ఉంటుందని మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని తెలిపారు. వివరాలకు 9121167316, 8897694942 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

జర్మనీలో పనిచేసేందుకు నర్సులకు ఇంటర్వ్యూలు

నిజామాబాద్ అర్బన్, జూలై5: ఓవర్సీస్ మ్యాన్ పవర్ లిమిటెడ్, తెలంగాణ ప్రభుత్వ కార్మిక ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ కాబడిన ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ టామ్‌కామ్, ట్రిపుల్ విన్ ప్రాజెక్టు కింద జర్మనీలో పనిచేసేందుకు అర్హతకలిగిన నర్సుల ఇంటర్వ్యూలను నిర్వహిస్తోంది. ఈనెల 9 నుంచి 17 వరకు హైదరాబాద్‌లోని బేగంపేట్ హోటల్ ది ప్లాజా, రెండవ అంతస్తులో ఇంటర్వ్యూకు హాజరుకావాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి సిరిమల్ల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టామ్‌కామ్ ద్వారా శిక్షణ తీసుకోబడిన రెండు బ్యాచ్‌ల నర్సింగ్ అభ్యర్థులు 31మంది ఇప్పటికే జపాన్‌లోని ప్రసిద్ధ ఆసుపత్రులో పనిచేస్తున్నారని మూడోబ్యాచ్ అభ్యర్థులు శిక్షణ పొందుతున్నారని, తదుపరి బ్యాచ్‌ల ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీఎన్ఎం/బీఎస్సీ అభ్యర్థుల వయస్సు 21 నుంచి 27 మధ్యవారు దరఖాస్తులు చేసుకోవచ్చని, వివరాలకు 99088304 38, 8919047600 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పాఠశాలలో చోరీకి యత్నం

మోపాల్, జూలై 5: మండలంలోని న్యాల్‌కల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి పాఠశాల గదుల తాళాలను పగలగొట్టి చోరీకి యత్నించారు. అందులో ఏమీ దొరకపోవడంతో గోడలపై అసభ్యకరమైన రాతలు రాసి వెళ్లిపోయినట్లు పాఠశాల ఉపాధ్యాయులు గుర్తించారు. శుక్రవారం ఉదయం పాఠశాలను సందర్శించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు చూసి స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. గుర్తుతెలియని దుండగులపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు స్థానికులను కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నం

ఖిల్లా, జూలై 5: నగరంలోని 5వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతారంనగర్ కాలనీలో తాళం వేసిన ఓ ఇంటికి కన్నం వేసి దొంగతనానికి యత్నించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. సీతారాంనగర్ కాలనీలో నివాసం ఉండే వెంకటేశ్వర్‌రావు అమెరికాలో ఉన్న తన కూతురి వద్దకు కుటుంబసమేతంగా మే నెలలో ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటంతో గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి తాళం పగలగొట్టి లోనికి చొరబడ్డారు. బీరువాలో ఉన్న వస్తువులను చిందరవందరగా చేశారు. వారికి ఎటువంటి విలువైన వస్తువులు లభించకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. వెంకటేశ్వర్‌రావుతో ఫోన్‌లో మాట్లాడి విలువైన వస్తువులు ఇంట్లోలేవని తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నారు.

నగరంలో కండక్టర్ ఆత్మహత్య

ఖిల్లా, జూలై 5: అనారోగ్య కారణాలతో ఓ కండక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగుచూసింది. మాక్లూర్ మండలం కల్లెడికి చెందిన శ్రీనివాస్(35) కండక్టర్‌గా పనిచేస్తూ నాందేవ్‌వాడలో అద్దెకు ఉంటున్నాడు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా.. అనారోగ్య సమస్యలను భరించలేక శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మూడో టౌన్ ఎస్సై-2 వాహబ్ తెలిపారు. మృతుడి భార్య, పిల్లలు సొంత ఊరు కల్లెడిలో ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బోధన్‌రూరల్, జూలై5: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని పలు వార్డులలో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఇళ్లలో వర్షపు నిల్వ ఉండకుడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటిపరిసరా ప్రాంగణాల్లోని టైర్లు, కూలర్‌లలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యానికి వేలం

రెంజల్, జూలై5: గత కొన్నినెలల కిందట సివిల్ సప్లై ఆధ్వర్యంలో 356 క్వింటాళ్ల 40 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యానికి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. రూ.25వేల డిపాజిట్ కట్టి నిర్వాహకులు వేలంలో పాల్గొన్నారు. రెంజల్‌కు చెందిన అన్సర్ హైమద్ 324 క్వింటాళ్ల 70కిలోల బియ్యాన్ని రూ.7.92 లక్షల వేలంలో దక్కించుకున్నారు. నిజామాబాద్‌కు చెందిన ఎస్‌కే.బాబా 31 క్వింటాళ్ల 70కిలోల బియ్యాన్ని రూ.93,500 వేలంలో కొనుగోలు చేశాడని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వేలం వేసినట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్, వేలం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.


వేలం నిర్వహిస్తున్న అధికారులు, పాల్గొన్న నిర్వాహకులు

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.265	రూ. 285

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,100	రూ.67,400	రూ.930

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి(3డి తెలుగు) (11.00, 2.45, 6.30, 10.15)
స్క్రీన్-2 : డిస్పికేబుల్ మి-4 (తెలుగు 3డి) (11.40, 2.00, 4.20, 6.40)
: డిస్పికేబుల్ మి-4 (ఇంగ్లీష్ 3డి) (9.00)
స్క్రీన్-3 : ఎంఎస్ ధోని (హిందీ) (11.30, 10.45)
: కల్కి(తెలుగు) (3.15, 7.00)
స్క్రీన్-4 : కిల్ (హిందీ) (11.15, 1.45, 8.00, 10.30)
: ఎంఎస్ ధోని (హిందీ) (4.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి(తెలుగు) (12.25, 3.50, 7.15, 10.50)
స్క్రీన్-2 : కల్కి(తెలుగు) (10.30)
: కల్కి(3డి తెలుగు) (2.00, 5.30)
స్క్రీన్-3 : కల్కి(హిందీ) (12.15)
: కల్కి(3డి తెలుగు) (4.05, 7.20, 10.45)

దేవి : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కల్కి(హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్